క్లుప్తంగా

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం


ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలకు శుక్రవారం ధ్వజారోహణం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. స్వామి వారి మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో ఉన్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ శాస్త్రోక్తంగా ధ్వజారోహణం చేశారు. మధ్యాహ్నం భాగవతారిణిచే హరికథ కాలక్షేపం జరిగింది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌పురం మండలానికి 18 ఆలయాలు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి

శ్రీరంగరాజపురం: తిరుమల శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మండలంలో 18 ఆలయాలు నిర్మించనున్నారని జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చొక్కమడుగు, దగువ మంగుంట, ముద్దికుప్పం, సి.కె.పురం, దాసరిగుంట, పుల్లూరు, శ్రీరంగరాజపురం, చిన్నతయ్యూరు, పెద్దతయ్యూరు, ఒడ్డుపల్లి, పిల్లిగుండ్లపల్లి, మత్రిపల్లి, వెంకటాపురం, రఘువరాజపురం, మిట్ట హరిజనవాడ, పొదలపల్లి, క్షీరసముద్రం, ఏ.యం.పురం, వడ్లిండ్లు తదితత గ్రామల్లో ఒక్కో ఆలయానికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు జనార్ధన్, మణి, భూపతిరెడ్డి, యుగంధర్ రెడ్డి ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


సర్టిఫికెట్లు అందజేస్తున్న బీఎం

పుత్తూరు రూరల్: యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పుత్తూరు పిళ్లారిపట్టు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని వై.మమత, 9 తరగతికి చెందిన జి.రమ్యశ్రీ తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. వీరికి బ్యాంకు మేనేజర్ కళ్యాణ్ కుమార్ శుక్రవారం బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం పి.మునిలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.

యువ ఉత్సవంలో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

నగరి: మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ ఇండియా తరపున చిత్తూరు నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన జిల్లా స్థాయి యువ ఉత్సవంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గ్రూప్ డ్యాన్స్ (ఫోక్)లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.2,500 నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికేట్లు అందుకున్నట్లు ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. విద్యార్థులు విజయలక్ష్మి, విశాలాక్షి, రేష్మ, మేఘన, గాయత్రి, లోకేశ్వరిలను అధ్యాపకులు అభినందించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం


ర్యాలీ చేస్తున్న డ్వాక్రా సభ్యులు

పాలసముద్రం: మహిళల ఆర్థికాభివృద్ధి కోసమే స్త్రీనిధి, బ్యాంకు రుణాలు అందిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం ఫరీదు మస్తాన్ అన్నారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో డిజిటల్ లావాదేవీలపై సీసీ, సంఘమిత్ర, డ్వాక్రా సంఘాల లీడర్లకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే మళ్లీ ఎక్కువ మొత్తంలో రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. చిన్న స్థాయి పరిశ్రమల నిర్వహణకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, బాలయ్య పాల్గొన్నారు.

ఆర్థిక పెన్నిధి.. స్త్రీనిధి..

మహిళల ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక డ్వాక్రా రుణాలు మాఫీ చేసి మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తోంది. ఇప్పుడు వారు మరింత ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తోంది. ఈ ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళల పాలిట ఆర్థిక పెన్నిధిగా మారుతోంది. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు స్త్రీనిధి రుణాలు జీవనోపాధితో పాటు కుటుంబపోషణ, ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయి.

మండలం	సంఘాలు	సభ్యులు	స్త్రీనిధి రుణం
గంగాధరనెల్లూరు	1,485	19,305	రూ.6.2కోట్లు
శ్రీరంగరాజపురం	1007	13,091	రూ.4.1 కోట్లు
కార్వేటినగరం	1040	14,560	రూ.3.8 కోట్లు
వెదురుకుప్పం	1122	14,586	రూ.4.3కోట్లు
పెనుమూరు	979	12,727	రూ.4.6కోట్లు
పాలసముద్రం	513	5526	రూ.3.3కోట్లు


డ్వాక్రా సంఘాల సభ్యులు (ఫైల్)

- మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న సబ్సిడీ రుణాలు
- ఇప్పటికే డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తున్న ప్రభుత్వం
- ఒక్కో సభ్యురాలికి రూ.4.50 లక్షల వరకు రుణ సదుపాయం
- ఎలాంటి హామీ లేకుండా 48 గంటల్లోనే మంజూరు

పాలసముద్రం: ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హతే ప్రామాణికంగా డ్వాక్రా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేస్తుండడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు వాటిని సక్రమంగా వినియోగించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. కొందరు తమ పిల్లల ఉన్నతవిద్య కోసం, మరికొందరు పాడి పశువులను కొనుగోలు చేసి పాలను విక్రయించి ఆర్థికంగా వృద్ధిలోకి వస్తున్నారు. ఇంకొందరు దుకాణాలు ఏర్పాటు చేసుకుని కుటుంబ పోషణ చూసుకుంటున్నారు. మహిళా ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోంది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలను ప్రభుత్వం మాఫీ చేయడంతో పాటు అవసరమైన మేర స్త్రీనిధి రుణాలను అందించి లక్ష్యాన్ని అధిగమించడానికి కృషి చేస్తోంది. పాలసముద్రం మండలవ్యాప్తంగా 5,526 మంది డ్వాక్రా సభ్యులు ఉండగా వీరిలో 256 మంది వరకు స్త్రీనిధి కింద రుణాలు తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధన వైపు అడుగులు వేస్తున్నారు.

లక్ష్యాలు ఇలా..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 2021–2022 ఆర్థిక సంవత్సరంలో రూ.24 కోట్లు, 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.26 కోట్ల లక్ష్యం ఇచ్చారు. వీటిని సభ్యులు అధిగమించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.26 కోట్లను లక్ష్యంగా నిర్ధారించగా, ఇప్పటికే రూ.13 కోట్లు మేర రుణాలను అందించారు. స్త్రీనిధి రుణాలు అవసరమైన సభ్యులు గ్రామ వీఏలకు సమాచారం అందిస్తే 48 గంటల్లోనే సంబంధిత బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు.

అప్పుడు అలా.. ఇప్పుడు ఇలా..

టీడీపీ హయాంలో గ్రూపులో ఉన్న ఐదుగురు సభ్యులను మాత్రమే ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.20 వేలు మాత్రమే రుణం ఇచ్చేవారు. అది కూడా తమ అనుయాయులకే అందజేసేవారు. మిగతా గ్రూపు సభ్యులకు ఏ కష్టం వచ్చినా పట్టించుకునేవారు కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డ్వాక్రా సంఘాలకు పెద్దపీట వేశారు. ఒక్కో గ్రూపునకు రూ.4.50 లక్షల చొప్పున స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నారు. అర్హులైన సభ్యులకు వారి అవసరాలను బట్టి రుణాలను అందిస్తున్నారు. అది కూడా సంబంధిత వీఏలకు సమాచారం ఇస్తే 48 గంటల్లోనే రుణాలను సభ్యుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

గ్రేడ్ ఆధారంగా..

గ్రామ సమైక్య సంఘాలను పరిగణనలోకి తీసుకుని స్త్రీనిధి రుణాలను మంజూరు చేస్తున్నారు. ఏ గ్రేడ్ సంఘానికి అయితే రూ.75 లక్షలు, బి గ్రేడ్‌కు రూ.65 లక్షలు, సి గ్రేడ్‌కు రూ.55 లక్షలు, డి గ్రేడ్ సంఘానికి రూ.45 లక్షలు చొప్పున రుణాలను అందజేస్తున్నారు.

జగనన్న వెలుగులు నింపుతున్నారు



మహిళల జీవితాల్లో సీఎం జగనన్న మరిన్ని వెలుగులు నింపుతున్నారు. ముఖ్యంగా స్త్రీనిధి రుణాలను సంఘాల సభ్యులు అంతా వినియోగించుకుంటున్నారు. మరికొందరు ఈ డబ్బును ఆర్థికంగా ఎదిగేందుకు వాడుకుంటున్నారు. మా మహిళల పాలిట దేవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆయనకు డ్వాక్రా మహిళలు రుణపడి ఉంటాం.

–డి.మునెమ్మ, ఎంఎంఎస్, అధ్యక్షురాలు

లక్ష్యానికి మించి రుణాలు..



ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని మించి స్త్రీనిధి రుణాలను డ్వాక్రా సంఘాల సభ్యులకు మంజూరు చేస్తున్నాం. గతేడాది రూ.2.30 కోట్ల లక్ష్యం కాగా రూ.3.30 కోట్ల రుణాలను అందించాం. పైసా ఖర్చులేకుండా 48 గంటల్లోనే రుణాలు మంజూరు చేస్తున్నాం. మహిళలు ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం.

–ఫరీద్ మస్తాన్, ఐకేపీ ఏపీఎం, పాలసముద్రం

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): జీడీనెల్లూరు మండలం వరత్తూరు గ్రామ సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూర్ణ చంద్రారెడ్డి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆయా గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానిక సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అర్హులకు లబ్ధి చేకూర్చడానికే జగనన్న సురక్ష

పాలసముద్రం: సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం తీసుకొచ్చిందని ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంపై శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. జనన, మరణ, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు కావాల్సిన వారు జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇంటింటికీ వచ్చే సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా నమోదు చేసుకుని సర్టిఫికెట్లు పొందాలన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించండి

నగరి: ఈ నెల 30వ తేదీలోపు మున్సిపల్ అసెస్‌మెంట్‌దారులు 6 నెలల ఇంటి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. గడువు దాటిన తరువాత చెల్లిస్తే వందకు రూ.2 చొప్పున పెనాల్టీ చెల్లించాల్సి వస్తుందన్నారు. పెనాల్టీ లేకుండా అందరూ గడువు తేదీలోపు సచివాలయలాల వద్ద గానీ, మున్సిపల్ కార్యాలయం, లేదా ఆన్‌లైన్‌లో చెల్లించి మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కేరోజా

- మంత్రి ఆర్కే రోజా

నగరి: జగనన్న సురక్ష అద్భుతమైన కార్యక్రమం అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై విజయపురం మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలు, కులమతాలకు సంబంధం లేకుండా అర్హత ఉన్న అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవసరమైన సర్టిఫికెట్లు అందాలన్న జగనన్న ఆశయాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లకు సంబంధించి సమస్యలు తెలుసుకుని వాటికి కావాల్సిన పత్రాలను అప్పుడే సేకరించి వాటిని సచివాలయాల్లో పొందుపరిచి టోకెన్లు అందజేయాలన్నారు. వారం రోజుల తర్వాత మండల స్థాయి అధికారులు ప్రతి సచివాయల పరిధిలో ఒకరోజు ఉండి పరిశీలించిన వివరాలను జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పథకాలు అందడంలో ఉన్న సమస్యలు పరిష్కరించడం, ఏ కారణం చేత రాలేదో తెలియపరచడంతో పాటు వివిధ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకున్న వారికి వాటిని అక్కడే అందజేస్తారన్నారు. ఇంటి వద్దకే పరిపాలన తీసుకొచ్చి వారి సమస్యలు పరిష్కరిండంతో పాటు, ఇంటి వద్దకే పెన్షన్, లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ సాయం చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష ఒక అద్భుతమని, ప్రతి ఇంటి గురించి ఇంత శ్రద్ధ తీసుకొని పనిచేసే ముఖ్యమంత్రి మనకుండడం అదృష్టమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపినాథ్, మండల సచివాలయ కన్వీనర్ రాజగోపాల్, కుమార్, రాజేంద్ర, శేఖర్ రాజు, గోపి, నారపరాజు, భాస్కర్‌రాజు, జ్యోతి, సరస్వతి, బాబు, పాండియన్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం


గ్రామ వీధుల్లో విహరిస్తున్న ద్రౌపదీ ధర్మరాజు

కార్వేటినగరం: స్థానిక ద్రౌపది ధర్మరాజుల స్వామి ఆలయంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు వేద మంత్రాలతో ధ్వజారోహణం చేశారు. మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డెమ్మ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. అమ్మవారికి మురళీకృష్ణ యాదవ్ వెండి శిరస్సును కానుకగా అందించారు. రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు శివ ప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి పాల్గొన్నారు.

నగరవనం నిర్మాణాలకు అనుమతి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని రెండు ప్రాంతాల్లో నగరవనం నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. కుప్పం, కార్వేటినగరం ప్రాంతాల్లో నగరవనం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కొక్క వనం రూ.1.40 కోట్లతో నిర్మించాలని ఉత్తర్వులు అందాయని వివరించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ


ఎస్‌ఆర్‌పురం: విద్యా సామగ్రి అందజేస్తున్న దాతలు

శ్రీరంగరాజపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని పిల్లిగుంట్లపల్లి గ్రామానికి చెందిన దాత త్యాగరాజులు నాయుడు అన్నారు. శుక్రవారం పిల్లిగుంట్లపల్లి పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో కిషోర్, మురళి, బాబు నాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రవి, మల్లికా, షణ్ముగం పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: వడమాలపేట మండలం బట్టికండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన సుబ్రమణ్యంరాజు విద్యా సామగ్రి అందజేశారు. 40 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్సిల్స్, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ తులసీరామ్, హెచ్‌ఎం రవిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జయశ్రీ, ప్రభావతి, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నగరి: విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దాత

నగరి: మున్సిపల్ పరిధిలోని కాకవేడు మాదిగవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాతలు అందజేసిన నోటుపుస్తకాలు, పెన్నులు, పలకలను ఎంఈఓ శ్రీదేవి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.రమేష్, నమశ్శివాయం పాల్గొన్నారు.

కుష్టురహిత సమాజానికి కృషి చేద్దాం


సమావేశానికి హాజరైన వైద్య సిబ్బంది


మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

కార్వేటినగరం: కుష్టురహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలకు కుష్టువ్యాధి గుర్తింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలన్నారు. స్పర్శ లేని మచ్చలు ఉన్నవారిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనుమానం ఉన్న వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. డాక్టర్లు గోపినాథ్, భువనేశ్వరి పాల్గొన్నారు.

రైతు భరోసా సిబ్బందికి అవగాహన

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): రాగి పంటసాగు, విస్తరణపై రైతు భరోసా సిబ్బందికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నగరి డివిజన్‌లోని నగరి, నింద్ర, విజయపురం, శ్రీరంగరాజపురం, జీడీనెల్లూరు, పాలసముద్రం మండలాల సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా డీడీఏ హబీబ్ బాషా మాట్లాడుతూ.. రాగి పంటను తక్కువ పెట్టుబడితో ఆరుతడి పంటలుగా సాగు చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా అధిక నికరాదాయాన్ని సాధించవచ్చని చెప్పారు. ప్రభుత్వం రాగులను రూ.38 చొప్పున రైతుల వద్ద కొనుగోలు చేస్తోందన్నారు. రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. రాగిపంట విస్తరణతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఆర్బీకేలలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందించాలని తెలిపారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

నాడు–నేడు పనుల పరిశీలన

పాలసముద్రం: మండల పరిధిలో నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రేమ్ రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం ఉన్నత పాఠశాల, వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. పాఠశాలలను అన్ని రకాల వసతులతో సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమైనా పనులు పూర్తి చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చేశారు. ఆయన వెంట ఎంఈఓ రాజేంద్రప్రసాద్, ఎంఈఓ–2 గిరిజ, ప్రధానోపాధ్యాయుడు చక్రాదరరావ్ ఉన్నారు.


వెంగళరాజుకుప్పం హైస్కూల్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ

తిరుచ్చిపై అలిమేలు మంగమ్మ కటాక్షం


తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారి దేవేరి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులో వెలసిన పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై విహరించి భక్తులను అనుగ్రహించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను శ్రీకృష్ణ ముఖ మండపం వద్ద కొలువుదీర్చి కనుల పండువగా కల్యాణోత్సవం చేశారు. తిరిగి సాయంత్రం అమ్మవారికి ఆలయ అలంకరణ మండపంలో విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్ సేవను చేపట్టారు. అనంతరం శ్రీవారి దేవేరి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏవీఎస్‌ఓ శైలేంద్రబాబు, వాహన ఇన్‌స్పెక్టర్ భాస్కర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం చొరవతో పేదలకు పట్టాలు


మాట్లాడుతున్న జెడ్పీటీసీ అన్బళగన్, నాయకులు

పాలసముద్రం: మండలంలోని టీవీఎస్‌ఆర్ పురం గ్రామస్తులకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో త్వరలో పట్టాలు పంపిణీ చేస్తారని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్ తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యకర్తలతో కలిసి టీవీఎస్‌ఆర్‌పురం ఆదిఆంధ్రవాడ గ్రామంలో మాట్లాడారు. గ్రామంలోని 250 ఎకరాల కాలువ పోరంబోకు స్థలంలో చాలా ఏళ్లుగా గ్రామస్తులు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. అయితే వాటిపై హక్కులు లేకపోవడంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆయన కలెక్టర్‌కు చెప్పడంతో సానుకూలంగా స్పందించారన్నారు. త్వరలో అర్హులకు పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, మహేష్ బాబు, సుబ్రమణ్యం రెడ్డి, చంద్రశేఖర్‌రాజు, సుందరాజు, సుబ్రమణ్యారాజు, చిన్నపయ్యన్, రవిరెడ్డి, గోవిందస్వామి పాల్గొన్నారు.

ఒలింపిక్ డే వేడుకలు

కార్వేటినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఒలింపిక్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు జోగి ప్రసాద్ మాట్లాడుతూ.. ఏటా జూన్ 23వ తేదీ అంతర్జాతీయ ఒలింపిక్ డే వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒలింపిక్స్ గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్య ఆచారి మాట్లాడుతూ.. వివిధ ఖండాల క్రీడాకారుల మధ్య మంచి స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడం కోసం ఒలింపిక్ క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు.


మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్య ఆచారి

తిరుపతిలో ధ్యాన్‌చంద్ విగ్రహం ఏర్పాటు

తిరుపతి కల్చరల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 29న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్లు తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.ప్రవీణ్ తెలిపారు. అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా శుక్రవారం శ్రీనివాస్ స్పోర్ట్ కాంప్లెక్స్ నుంచి టౌన్ క్లబ్ సర్కిల్ వరకు ఒలింపిక్ రన్ చేపట్టారు.

పీవీపురంలో వైద్య సేవలు

శ్రీరంగరాజపురం: మండలంలోని వెంకటాపురం సచివాలయం పరిధిలో ఉన్న పీవీపురం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ పల్లవి వైద్య సేవలు అందించారు. పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు పాలు, కోడి గుడ్లు, ఆకుకూరలు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికే ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను తీసుకొచ్చిందని తెలిపారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్